



వీధిలో కారు 'బోంయ్' మనేసరికి వంటింట్లో పని చేసుకుంటున్న కాంతమ్మ గుండెలు గుభిల్లుమన్నాయ్. రాత్రి ఎనిమిది గంటలు కానిదే ఆఫీసునించి ఊడిపడని బాబుగారు ఈ రోజు అయిదు గంటలకే రావడానికి కారణం తెలియక తికమక పడిపోతోంది.

రాజారావు నెరసిన తల మరీ తెల్లగాను, ముఖం నల్లగాను-ఫోటో నెగటివ్‌లా ఉంటాడు. రాజారావు వస్తుంటే ఇంట్లోకి పులి అడుగు పెడ్తున్నట్లుంటుంది. కారు దిగడమే ధుమధుమలాడుతూ సణుగుకుంటూ, గొణుక్కుంటూ ఇంట్లోకి వస్తాడు. అడుగు పెడుతూనే దీపాలు వెలిగించి ఉంటే 'డబ్బు ఎక్కువై పోతున్నట్టుంది. రాత్రింబగళ్లూ కరెంటు కాల్చేస్తున్నారు. ఇంటి ఆడదానికి పొదుపూ సదుపూ అంటూ ఉండాలి. ఏబ్రాసిముండలు జతపడ్డారు' అనో, దీపాలు ఆర్పేసి ఉంటే 'ఇంట్లో పీనుగుపోయింది కాబోలు దరిద్రపు ముండలు చీకట్లో దేవులాడుతున్నారు' అనో ఏదో ఒకటి సతాయిస్తూ అడుగుపెడ్తాడు. 'ఆ తువ్వాలు అక్కడెందుకుంది', 'ఈ గ్లాసు ఇక్కడెందుకు తగలడుతోంది' 'నీ ముఖం ఇవ్వాళ దీపపు శమ్మాలాగా వెలిగి పోతోందేమిటి?" అంటూ ఇంట్లో ఉన్నంతసేపూ పెళ్ళాన్ని వంటమనిషినీ కాల్చుకు తింటాడు. ఆఫీసుకి ఎప్పుడు పోతాడా అని దేవుడ్ని మొక్కుకుంటూంటారు.

ఈ రోజు కారు దిగ్గానే సన్నగా ఈలవేసుకుంటూ చేతికర్రని హుషారుగా తిప్పుకు వస్తున్న రాజారావుని చూసి కాంతమ్మ నివ్వెరపోతూ ఎదురుగా వెళ్ళి చేతికర్ర అందుకుంది. రాజారావుగారి భార్య అన్నగార్కి ఒంట్లో బాగులేదని పుట్టింటి కెళ్ళి వారం రోజులయింది. ఇంట్లోకి వస్తూనే కోటు స్టాండుకు తగిలిస్తూ, చేతి గడియారం, గోడ గడియారం సరిచూసుకున్నాడు. టైము అయిదున్నరే అయింది. చలికాలం కావటం మూలాన వెలుతురు బాగా తగ్గిపోయింది. సూర్యుడు కృంగిపోతున్నాడు. ఆకాశం 'పులి చంపిన లేడి నెత్తురు' పూసుకున్నట్లు ఎర్రగా ప్రకాశిస్తోంది.

"వంట అయిపోయిందా — అయితే పళ్ళెంలో పెట్టి మూతపెట్టి వెళ్లిపో" అన్నాడు కాంతమ్మ సమాధానాన్ని ఎదురు చూడకుండానే. జోడు విప్పబోతూ సాలోచనగా ఆగి రోడ్డుమీదకి చూశాడు. రోడ్డు దీపాలు వెలిగాయి. పరధ్యానంగా ఉన్న రాజారావు ఇంట్లో దీపాలు వెలిగించాలనే సంగతే మరచిపోయాడు. జోళ్ళు విప్పకుండానే లేచి ఏదో ఆలోచిస్తూ రెస్ట్‌లెస్‌గా ఇంట్లో పచార్లు చేస్తున్నాడు. గదిలో సంజెనీడలు అలుముకుంటూ మసగ మసగ్గా ఉంది. పచార్లు చేస్తున్న రాజారావు దిగులుగా లేడు. ఎరకోసం ఎదురు చూస్తున్న పులిలా ఆత్రుతగా ఉన్నాడు.

"డామిట్! ఆరయింది. ఇంకా రాలేదేం? ఎక్కడ చచ్చాడో ఈ అప్పన్నగాడు....కొంపతీసి హేండు ఇచ్చేస్తాడేమిటి!....హుఁ మసి చేసెయ్యనూ" అనుకుంటూ అరుగు మీదికి గబగబా వెళ్ళి రోడ్డు మీదికి అటూ ఇటూ చూశాడు. 'ఛశ్' అని విసుక్కుంటూ గదిలోకి చరచరా వచ్చి నిరాశగా సోఫాలో కూలబడబోతూ గతుక్కున ఆగాడు. ఏదో అవ్యక్తమయిన భయంతో ఒళ్ళు జలదరించిపోతోంది. లీలగా దయ్యాన్ని చూసినట్టు గజగజలాడిపోతున్నాడు. ఎదురుగా బీరువాకి అమర్చిన నిలువుటద్దంలో తన నీడ గజిబిజిగా వికృతంగా కనిపించింది. దానికి తల లేదు. నరికేసినట్టుంది. తలలేని రాజారావు భూతం తన ఎదురుగా నిల్చొనుంది. తల లేకపోయినా మొండెంలోంచి కళ్లు పెట్టుకుని తన వైపు తీక్షణంగా చూస్తున్నట్లుంది.

"వాట్" తన కళ్ళని తనే నమ్మలేకపోతూ ఊపిరి బిగబట్టి పిడికిలి బిగించుకుంటూ ధైర్యం కూడ గట్టుకుని తడబడుతూ ముందుకు నడిచాడు. రాజారావు భూతం కూడా పిడికిలి బిగించుకుంటూ తన మీదికి వస్తోంది. రాజారావు తన భూతాన్ని ఇహ చూసే ధైర్యం కూడా చాలక గట్టిగా ఎడమ చేత్తో రెండు కళ్ళూ మూసుకుని వెంబెలెత్తిపోతూ పరుగున వెళ్ళి స్విచ్ వేశాడు. దీపం గప్పున వెలిగింది. భయంతో రొప్పుకుంటూ మెల్లగా తలెత్తి అద్దంలోకి చూశాడు.

"కాంతమ్మా!" అని గావుకేక పెట్టేసరికి వంటింట్లోంచి కాంతమ్మ అదరా బాదరాగా వచ్చింది.

"ఏమిటా అద్దం మీద మరక?"

"అదా బాబూ!.......అది.......పొద్దున్న కుర్రాడు బీరువా మీద వార్నిషు డబ్బా పెట్టి రంగేస్తుంటే చెయ్యి తగిలింది, డబ్బా పడిపోయిందండి. అద్దంమీద వార్నిషు రంగు ఒలికిపోయిందండి. చాలా మటుకు కిరసనూని పెట్టి తుడిచేశాడండి. మిగతా ఈ ముక్కని రేప్పొద్దున్నే తుడుస్తానన్నాడండి" అంది నీళ్ళు నములుతూ.

"అఘోరించాడు కాడు వెధవ" అంటూ నిట్టూరుస్తూ సోఫాలో కూర్చుంటున్న వాడల్లా ఇంకా ఎదురుగా నిలబడున్న కాంతమ్మని చూసి కస్సుమంటూ లేచాడు. "ఇంకా ఎందుకలా దిష్టిబొమ్మలా నిల్చున్నావ్. వంటయితే పళ్ళెంలో తగలెట్టి పో. నక్క వినయాలు చూపుతూ నా దగ్గర నిల్చోకు" అంటూ కసిరేసరికి "అన్నీ పళ్ళెంలో పెట్టి మూతపెట్టానండి" అని వెళ్ళి వంటింటి తాళం వేసి, "ఇవిగోనండి తాళాలు" అని టేబిలు మీద పెట్టి వెళ్ళిపోయింది.

'డామ్! బ్లాక్......వాటె షాక్—తన నీడ ఎంత వికృతంగా కనిపించిందో! దానికి తల లేదు. భూతంలా ఉంది. తన నీడే తనకి దెయ్యంలా కనిపించింది. తన మీదకే ఉరుముతూ వచ్చింది.........అబ్బా!' అనుకుంటూ ఇంకా గుండెలు కొట్టుకుంటుంటే కాసేపలానే తల పట్టుకుని కళ్ళు మూసుకుని సోఫాలో చతికిల బడ్డాడు.

కాస్త తేరుకున్న తర్వాత నెమ్మదిగా లేచి సిగరెట్టు వెలిగించి పొగవదులుకుంటూ, ప్రక్కగదిలో మంచం మీద జారగిలబడదామని వెళ్ళబోతూ గుమ్మం దగ్గర ఉన్న గాజు చేపలతొట్టి (ఎక్వేరియమ్) దగ్గర ఆగాడు. స్విచ్ వేశాడు. తొట్టెలో రంగు దీపం వెలిగింది. నీళ్ళలో రంగు రంగుల కాంతులు ప్రతిఫలిస్తున్నాయి. నీటి నీడలు గాజు తొట్టెలో నించి ఎదురుగుండా గోడ మీద పడి అలలుగా పరిగెత్తుతున్నాయ్. తొట్టె అడుగున అందమైన నాచు కూడా వుంది.

"రిగ్గీ! రిగ్గీ! కమాన్—కమాన్" అని రాజారావు గాజు తొట్టె మీద రెండుసార్లు చిటికెలు వేశాడు. రిగ్గీ నాచులోంచి దొంగలా మెల్లగా బైటికి వచ్చింది. అది నల్లగా వికృతంగా ఉంది. దానికి మీసాలు కూడా ఉన్నాయి. నెత్తురు తాగి కొవ్వెక్కినట్లు మోటుగా దృఢంగా ఉంది. అది చేపలా కాదు చిన్న రాక్షసి పిల్లలా ఉంది. రాజారావుని చూసి నోరు ఆగలించింది. దాని పళ్ళు కరకుగా సన్నని రంపాల్లా ఉన్నాయి.

ఇదంతా సాలోచనగా గట్టిగా దమ్ము పీలుస్తూ చూస్తున్న రాజారావుకి బైట సైకిలు బెల్లు వినిపించింది. బైటకి గబగబా వచ్చాడు. అప్పన్న గోడకి సైకిలు జారేసి రాజారావు దగ్గరకి పరుగున వచ్చి యేదో చెవిలో గొణిగాడు.

"గదిలో కూర్చోబెట్టు...ఇప్పుడే వస్తాను" అంటూ తొందర తొందరగా అంతవరకూ కాళ్ళకున్న బూట్లు విప్పేసి లోపలికి వెళ్ళిపోయాడు.

మరి కాస్సేపటికి సైకిలు రిక్షా ఒకటి బాధతో మూల్గుతున్నట్లు బరువుగా గేటులోంచి వచ్చి ఆగింది. అది వస్తుంటే దాని అరిగిపోయిన పళ్ళ చక్రం "క్రీచ్! క్రీచ్! క్రీచ్!" మంటూ గెద్ద గోళ్ళలో చిక్కుకున్న కోడిపిల్ల అరుస్తున్నట్టుంది. రిక్షాలోంచి ఓ అమ్మాయి దిగింది. రిక్షావాడికి డబ్బులిస్తుంటే అప్పన్న ఎదురుగా వెళ్ళి "ఒరేయ్ రిక్షా! అమ్మగారు వచ్చేదాకా గేటు అవతల వేపచెట్టు క్రింద ఉండు" అని రిక్షా వాడు గేటు దాటేదాకా ఆగి "రండమ్మాయిగారూ, గదిలో కూర్చోండి. బాబుగారు ఏదో పన్లో ఉన్నారు. ఇప్పుడే వచ్చేస్తారు" అని సరళని గదిలోకి తీసుకువెళ్తూ "చూడండమ్మాయ్‌గారూ! మీ సంగతంతా బాబుగారికి చెప్పాను. బాబుగారు తలచుకుంటే మీకు ఉద్యోగమన్న మాటేంటి ఏదైనా చేసెయ్యగలరు. సిగ్గుపడకుండా అన్నీ మాట్లాడుకోండి. నేను బయట ఉంటాను" అని బయటకు వెళ్ళిపోయాడు.

సరళ గదిలో సోఫాలో కూర్చుంది. నల్లగా ఒళ్ళుగా ఉంది. అందంగాలేదు. ఇరవై సంవత్సరాలే అయినా పాతిక దాటినట్లు కనిపిస్తుంది, లావుగా ఉండటంచేత. గోడ గడియారం చేసే టిక్-టిక్ శబ్దం తప్ప గదంతా నిశ్శబ్దంగా ఉంది. గదిలో ట్యూబులైటు వెలుగుతూంటే బయట చీకట్లు అల్లుకుంటున్నాయి. పగలంతా రంగు రంగుల ఆకుల్తో అందంగా కనిపించే క్రోటన్సుమొక్కలు చీకట్లో జడలు విరబోసుకున్న దయ్యాల్లా కన్పిస్తున్నాయి.

గాజు తొట్టెలోని నాచు తీగలు ముద్దగా అల్లుకుని తనని పెనవెయ్యడానికి ఎదురు చూస్తున్నట్లు అనిపించింది సరళకి. 'రిగ్గీ' తన వైపు ఆకలి గొన్న రాక్షసుడిలా చూస్తూ అప్పుడప్పుడు నోరు ఆవలిస్తోంది. నిత్యం దరిద్రంతోనూ, ఆకలితోనూ, భయంతోనూ నలిగిపోతున్న సరళని 'రిగ్గీ' చూపులు భయపెట్టలేక పోయాయి. అక్కడ మనస్సులో భయంగాని ఆందోళన గాని లేని సరళ నిశ్చలంగా గంభీరంగా శిలాప్రతిమలా ఉంది.

ఊరవతల మురికి కాలవ ఎదురుగా మునిసిపల్ లాంతరు ప్రక్కన తనూ, పక్షవాతపు తండ్రీ, పెళ్ళలూడిపోయి, చూరు జారిపోతున్న పెంకుటింట్లో కాపురముంటున్నారు. సరళ తండ్రి గుమాస్తా ఉద్యోగం చేస్తూ ఒక్కగానొక్క కూతుర్ని బి. ఎ. చదివించాడు. సరళ ఇంటర్ చదువుతున్నప్పుడే రిటైరైపోయాడు. వచ్చిన ప్రావిడెంటు ఫండు సొమ్ము అంతా కూతురి బి.ఏ. చదువుకి అయిపోయింది. సరళ

బి. ఎ. ప్యాసయినప్పటికి ఉన్న సొమ్మంతా హరించుకుపోయిన తండ్రి పక్షవాతం వచ్చి కాలూ చెయ్యి పడిపోయి మంచాన పడ్డాడు. వచ్చే ఏభై రూపాయల పింఛనూ ఇంటద్దెకి ఒక పూట గంజికే చాలటం లేదు. బి. ఎ. పట్టా పుచ్చుకుని ఉద్యోగంకోసం సరళ తిరగని ఆఫీసు లేదు. పగలంతా ఉద్యోగం కోసం తిరిగి తిరిగి ఆకలితో అర్చుకుపోతున్న పేగుల్తో గుమ్మంలో అడుగు పెట్టేసరికి ఎదురుగా రోగంతోను ఆకలితోనూ గింజుకుంటున్న తండ్రి "సరళా! రాజారావుగారి ఇంటికి వెళ్లలేదు కదూ?.........ఈ రోజూ వెళ్ళలేదు కదూ?...నీకు ఈ జన్మలో ఉద్యోగం దొరకదే. వెళ్ళి ఆయన్ని ఇంటి దగ్గర కలుసుకోమంటే నీకు పోయేకాలమే - ఇంతోటి అందగత్తెనూ కొరుక్కు తినేస్తాడా? నీ చదువు కోసం బికారినై పోయాను గదటే.....మందూ మాకూ లేక చస్తున్నానే...నన్నిలా చంపెయ్యడం న్యాయం కాదే" అని పిచ్చిగా కేకవేస్తుంటే వంటింట్లోకిపోయి తలదించుకుని బోరుమనేది. ప్రక్కసందులో ఉన్న ప్యూను అప్పన్న తను లేనప్పుడల్లా తండ్రి దగ్గరకి వచ్చి, మీ కూతురు రాజారావుగారిని ఇంటి దగ్గర కలుసుకుంటే తప్పక ఉద్యోగం దొరుకుతుందని తండ్రిని పురమాఇస్తున్నాడు. రాజారావుని ఇంటిదగ్గర కలవటం సరళకి ఇష్టంలేదు. రాజారావు ఎటువంటివాడో ఇంటికి వెళ్తే ఏం జరుగుతుందో తండ్రికి తెలిసుండీకూడా ఇంటికి వెళ్లమని కన్న కూతుర్ని సతాయిస్తున్నాడంటే!—— కారణం సరళకి తెలియకపోలేదు——

"పాపం! నాన్న చిన్నతనంలో తల్లిపోయినా తల్లిలా సాకాడు. తన చదువు కోసం హరించుకు పోయాడు-ఇప్పుడు కాలూ, చెయ్యీ పడిపోయింది. మందు లేకపోయినా కనీసం ఒక పూట తిండి కూడా సరిగ్గా పెట్టలేకపోతోంది. ఆకల్తో నాన్నకి కోపం కూడా పెరిగిపోతోంది. ఆవేశంతో కేకలేస్తాడు. ఎప్పుడో గుటుక్కున గుండె ఆగిపోతుంది." అని తలచుకుంటూంటే కళ్ళవెంట నీళ్ళు బొటబొట రాలేవి. రాను రాను తండ్రి "లంజా-ముండా"వరకూ వచ్చేసరికి మరి భరించలేకపోయింది. 'ప్చ్! క్షణంసేపు నా ఒళ్లు కాదనుకుంటే పోయింది. ఉద్యోగం దొరికితే తండ్రికి అవసాన దశలో కాస్తంత సుఖపెట్టాననే తృప్తి ఉంటుంది" అని నిర్ణయించుకుని రాజారావు ఇంటికి బయలుదేరింది.



ప్రక్కగదిలోనుంచి రాజారావు హాలులో అడుగుపెట్టగానే హాలంతా సువాసనలతో గుప్పుమంది. ఆ వాసనకి క్లోరోఫారం పెట్టినట్లు సరళ కాస్త ఉక్కిరిబిక్కిరై లేచి నిల్చుని నమస్కరించింది. వాసన నూనె పూసుకున్న అతని తెల్లని జుత్తు ట్యూబులైటు కాంతిలో నెత్తిమీద కొత్త సిల్వరు గిన్ని బోర్లించినట్టుంటే, పౌడరు అద్దుకున్న అతని ముఖం బూజుపట్టిన గొడుగు గుడ్డలా ఉంది. చిన్న మందహాసం చేస్తూ ప్రతినమస్కారం చేసి కూర్చోమని సౌంజ్ఞచేసి ఎదురుగా కూర్చున్నాడు.

"ఊ! ఎంతసేపయింది వచ్చి?"

"ఇప్పుడేనండి."

"నీ పేరు సరళకదూ?"

"అవునండి." అంటూ పయట కప్పుకుంది.

"ఉక్కబెడ్తుందా-ఫేను పెడ్తాను" అంటూ కిసుక్కున నవ్వి ఫేను వేశాడు. రంయ్‌మని ఫేను గాలి తగలగానే అమాంతంగా తనని మార్చురీ రూమ్‌లోకి విసిరేసినట్టు వణికింది. అలా వణుకుతున్న సరళ సిగ్గుతో ముడుచుకు పోతున్న శోభనపు పెళ్ళి కూతురిలా కనిపించింది రాజారావుకి.

"నువ్వు బియ్యే ప్యాసయ్యావు కదూ."

"ఊఁ...."

"పాపం మీ నాన్నకి పక్షవాతం అంటగా-అప్పన్న చెప్పాడు."

"ఊఁ"

"హారిబుల్ డిసీజ్......తను బ్రతకడు సరి కదా బ్రతికున్న ఎదటివాళ్లను చంపేస్తాడు.... అఫ్‌కోర్సు ఆ జబ్బు అటువంటిది.... హెల్.... మందులు ఇప్పిస్తున్నావా రిగ్యులర్‌గా?"

"లేదు."

"ఏం?"

"డబ్బు లేదు...."

"నాన్‌సెన్స్. డబ్బులేదని మందులు ఇప్పించడం మానేస్తావా తండ్రి అలా బాధపడుతూంటే అలాచూస్తూ ఊరుకుంటావా. దాంట్లో ఒక ర్తివే కూతురివాయె. యు షుడ్ బి ఎ డ్యూటిఫుల్ డాటర్" అంటూ చిరాగ్గా ముఖం చిట్లించుకున్నాడు.

"ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకడం లేదండి. నానా ఇబ్బందులు పడుతున్నాను."

"వెరీ పిటీఫుల్ కేస్....అవును పాపం."

"నాకు టైపుకూడా వచ్చునండి" అంటూ అప్లికేషన్ ఫైల్లోంచి తీసి అందించింది.

"ప్చ్. టైపు ఈ రోజుల్లో ఏమంత ఎడిషనల్ క్వాలిఫికేషను కాదు" అంటూ అప్లికేషను అందుకుని చూసి "దీన్ని ఆఫీసులో ఇచ్చావు కదా?"

"ఎందుకన్నా మంచిదని స్వయంగా ఇద్దామని కాపీ తెచ్చాను."

"ఐసీ" అంటూ స్టూలుమీద పెట్టాడు. గాలికి ఎగిరిపోబోతుంటే సరళ దానిమీద ఫైలు బరువు పెట్టింది.

.... .... .... ....

"నీకు పెళ్ళయిందా?" ప్రశ్నించాడు సరళ ఎక్స్‌పెక్ట్ చేసినట్టుగానే. అయినా ఒక్కసారి సరళ ఒళ్ళు ఝల్లుమంది.

"నీకేం రంభలా ఉంటావు."

సరళ గొంతులో తడారిపోయి అదోలా అయిపోతోంది. తల ఒంచేసుకుంది.

.... .... .... ....

"ఎవడైనా కళ్ళు కద్దుకుని పెళ్ళాడ్తాడు—అరె అంత సిగ్గెందుకు. అలా అయితే ఆఫీసులో ఎలా పని చెయ్యగలవు."

సరళ నేలమీద బెదురు చూపులు చూస్తోంది.

"రేపే నిన్ను ఎపాయింట్ చేస్తున్నాను."

ఈ మాట వినేసరికి అంతవరకు ఆవరించుకున్న బెదురు మంచులా కరిగిపోయింది. సంతోషంతో ఉలిక్కి పడింది. "తను రేపట్నించి ఉద్యోగంలోకి వెళ్తుంది. నెలజీతం. అప్పుల వాళ్ళబాధ, ఆకలిబాధ ఇవేవీ ఉండవు. నాన్నకి మందులు కొంటుంది. 'నా తల్లే' అంటూ తల నిమురుతాడు....తనకో! కావలసినన్ని చీరలు. చేతికి రిస్టువాచీ....హాయిగా ఆనందంగా...." అనుకుంటూ ఒక్క క్షణంపాటు కళ్ళుమూసుకుని హాయిగా గాలి పీల్చుకుని కళ్ళు విప్పేటప్పటికి తన ఒంటిమీద గళ్ళచీర గాలికి రెపరెపలాడుతూ దానిమీద రంగు రంగుల గళ్ళు గజిబీజిగా తన ఊహల్లాగే తేలిపోతున్నాయి.

"థాంక్యూ సార్" అంటూ రాజారావు వైపు చూసింది.

రాజారావు పెదాన్ని పళ్ళతో నొక్కుకుంటూ సరళ కళ్ళల్లోకి చూస్తున్నాడు. అతని కళ్ళల్లో నించి కామం పొగలు కక్కుతోంది. కుతకుతలాడే అగ్నిపర్వతం బ్రద్దలయ్యే ముందు బీటలు వేసినట్లు అతని కళ్ళలో ఎర్రటి జీరలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సరళకి తిరిగి భయం వేసింది. రాజారావు చూపుల్నించితప్పుకుని గోడ వైపు చూసింది. అక్కడ గాజు తొట్టెలో రిగ్గీ గుప్పుగుప్పున గాలిబుడగలు విడుస్తూ తన వైపే చూస్తోంది—తరవాత అక్కడ ఏం జరగనున్నదో ఊహించుకొనేసరికి సరళకి గుండెలు దడదడలాడాయి. లేని ధైర్యం తెచ్చుకుని "ఫరవాలేదు. క్షణం సేపు కళ్ళుమూసుకుంటే...." అని తన్ని తాను సమాధానపరచుకుంది.

"ఏమిటాలోచిస్తున్నావు. రెండు రోజుల్లో నీ యిల్లు ఖాళీచేసెయ్యి. ఇల్లు కూడా ఎలాట్ చేస్తాను. లేడీస్‌కి ప్రిఫరెన్సు ఇవ్వాలి కదా—లేడీస్ ఫస్ట్" అని గొప్ప విట్టు వేసినట్టు ఫెళ్లున నవ్వాడు.

సరళ సాలోచనగా గాజు తొట్టెలోని 'రిగ్గీ' లో రాజారావు ఆత్రతని చూస్తోంది.

"అన్నట్టు కాఫీ తాగావా? ఇంట్లో ఎవరూ లేరు కాఫీ చెయ్యడానికి. కాస్త స్నేక్స్ తెస్తానుండు"

"వద్దండీ."

"నో నో" అంటూ గదిలోనికివెళ్ళి ప్లేటులో బిస్కత్తులు పట్టు కొచ్చి కూర్చున్నాడు. ఎదురుగా కాదు—సరళ పక్కలో.

"టేక్ ఇట్" అన్నాడు తనొక బిస్కత్తు కొరుకుతూ.

"వద్దండి-నాకు ఆకలిగా లేదు" అంది తడబడుతూ నాలిక పిడచ గట్టేస్తూంటే.

"నో. నా దగ్గర పని చెయ్యబోయే వాళ్ళు నా మాట వినడం మర్యాద" అంటూ తనే బిస్కత్తు తీసి నోటికి అందివ్వ బోయాడు. సరళ వద్దని చేత్తో వారిస్తూంటే మెల్లగా చెయ్యి పట్టుకున్నాడు. నోటికి అందివ్వ బోయిన బిస్కత్తు జారి పోయింది. సరళ గింజుకోలేదు. ఊరుకుంది...."పిట్ట బెదరటంలేదు" అని చొరవచేశాడు. కిందికి లాక్కున్నాడు. ఒళ్ళో పడిపోయింది. తిరిగి రెండు జబ్బలు పట్టుకుని లేవనెత్తాడు. మదించిన అడవిదున్న బుసకొడుతున్నట్లు రాజారావు ఎగశ్వాసలతో రొప్పుతున్నాడు. చెమట్లు పోస్తున్న అతని శరీరం సరళకి మృగ వాసన కొట్టింది....అమాంతంగా లేవనెత్తుతుని ప్రక్క గదిలోనికి తీసుకుపోయాడు. పోతూ పోతూ సగం కొరికిన బిస్కత్తు ముక్కని గాజు తొట్టెలో విసిరేసి గభాలున తలుపులు మూసేశాడు.

.... .... .... ....

.... .... .... ....


గాజు తొట్టెలో బిస్కత్తు ముక్క పడీ పడ్డంతో ఆకలితో ఆవురావురు మంటున్న 'రిగ్గీ' ఒక్క ఊపున వెళ్ళి ఎటాక్ ఇచ్చింది. ఛట్ ఛట్ ఛట్ మని ఎగురెగుస్తూ దాన్ని ముట్టెతో పొడిచి చిందర వందర చేసేస్తోంది. బిస్కత్తు ముక్కని నీటిలో తనివితీరా ఆడిస్తూ చప్పరిస్తోంది. కసితీరా కొరికేస్తోంది....మింగేస్తోంది....

.... .... .... ....

తలుపులు తెరుచుకున్నాయి.

సరళ గదిలోంచి నిర్జీవంగా వచ్చి స్టూలు మీద ఫైలు తీసుకుని వెళిపోతుండగా "రేపే వచ్చి ఆర్డరు తీసుకుని జాయినయిపో" అన్నాడు రాజారావు గదిలోనించే.

స్టూలుమీద సరళ అప్లికేషన్ ఫేను గాలికి ఫర ఫర మంటూ గదంతా అస్తవ్యస్తంగా ఎగిరి ఎగిరి కిటికీలోంచి చీకట్లోకి ఎగిరి పోయింది.




. రిక్షా క్రీచు క్రీచు మంటూ వెళ్ళిపోయింది. దాని వెనకాలే అప్పన్న సైకిలు గణగణ మంటూ వెళ్ళింది.

తనివితీరా విందారగించిన రిగ్గీ ఘుక్తా యాసంతో మత్తుగా నాచులో పడుకుంటోంది.

*        *

మరునటిరోజు.

ఆకాశం మబ్బు పట్టింది.

రాజారావు ఆఫీసు రూములో ఫైళ్ళు తిర గేస్తున్నాడు. గోడకి మహాత్ముని పటం వ్రేలాడు తోంది. ప్రక్క గదిలో టైపు రైటరు టప టప లాడుతోంది.

టేబిలుమీద ఫైల్లో ఎదురుగా సరళ అప్లి కేషన్ ఉంది.

"ఇంకా ఆఫీసుకి దొరగారు దయచెయ్య లేదనుకుంటాను. అప్పుడే పదిన్నర కావస్తోంది. ఏమన్నా అంటె చిర్రు బుర్రు మంటారు. గుమాస్తాలైనా దర్జాకి లోటులేదు. ఇంత లేటా. రాగానే రమ్మని చెప్పు. అర్జంటు ఆఫీసు ఆర్డరు ఇవ్వాలి." అని అప్పన్నని బెల్లు కొట్టి పిలిచి చెప్పాడు.

తలమీద కీచు కీచు లాడుతున్న ఫేను గాలికి సరళ అప్లికేషన్ రెపరెప కొట్టుకుంటుంటే రాజారావుకి అది కవ్విస్తున్నట్టుంది. ఆ అప్లి కేషన్ని చూస్తున్న కొద్దీ రాజారావుకి క్రితం రాత్రి మధుర స్మృతులు తెరలు తెరలుగా గుర్తుకొస్తున్నాయి. తను సరళకోసం వెయిట్ చెయ్యడం-సరళ పైట కప్పుకోవడం-అమాంతంగా సరళని ఎత్తుకోవడం-తరవాత.... ఇంకా! కళ్ళు మూసుకుని మనస్సులో నవ్వు కున్నాడు. అపాయింట్‌మెంట్ చూడగానే సరళ ఉప్పొంగి పోతుంది- ఈ రాత్రి అశోకా హోటల్‌కి రమ్మంటే....అందంగా లేక పోయినా "పిట్ట పిటపిట లాడుతోంది" అను కుంటూ క్రింది పెదవిని కైపుతో గట్టిగా కొరు క్కున్నాడు.

టెలిఫోను గణగణ మనగానే ఈ లోకంలో పడ్డాడు. టెలిఫోన్ విరిచేద్దామా అని బుద్ధి పుట్టింది. చిరాగ్గా రిసీవర్ తీసి "హలో" అన్నాడు. అవతల ఐడెంటిఫికేషన్ మినిష్టరని తెలుసుకుని ఒక్కసారి కాళ్ళలో పాము పడి నట్లు తుళుక్కుపడి లేచి నిల్చున్నాడు.

"ఎస్ సార్....ఎస్ సార్....నమస్కారం సార్. అవును సార్ నేనే నండీ. రాజా రావుని! నమస్కారం సార్!"

.... .... .... ....

"ఎస్ సార్....సార్....సార్!"

.... .... .... ....

"మా ఆవిడ ఆరోగ్యమా సార్. ఇప్పుడు కాస్త నెమ్మదిగా ఉందండి మీ దయవల్ల.... సార్!"

.... .... .... ....

"ఏమిటి సార్! నాకూ ట్రాన్స్ఫరా....అను కుంటున్నారా....సార్....రోగిష్టి పెళ్ళాన్ని పెట్టుకుని ఈ వయస్సులో ఎక్కడికి ట్రాన్స్ఫరు మీద వెళ్ళగలను సార్....మీరు చక్రం అడ్డు వెయ్యాలి సార్, లేకపోతే చచ్చిపోతాను.... సార్!"

.... .... .... ....

"చిత్తం సార్....థేంక్యూ సార్....మీరు తలుచుకుంటే ఇదొక లెక్కా!....థేంక్యూ సార్....ఏమిటి సార్?"

.... .... .... .... ....

"ఈ ఆఫీసులోనా సార్....ఆ—సార్ అవును గుమస్తా వేకెన్సీ ఉంది సార్....అవును సార్....ఇంకా భర్తీ కాలేదనుకోండి........ సార్....ఇంటర్‌వ్యూలు కొందరిని చేశాను కోండి....సార్...."

.... .... .... ....

"మీ కేండిడేటు ఉన్నాడా సార్. తప్ప కుండా పంపించండి సార్....ఓకె....మంచి వారే బాబూ! మీకు కాదనగలనా....పంపిం చండి....మీ కేండిడేటు కోసం ఎదురుచూస్తాం టాను. వచ్చిన వెంటనే జాయిన్ అయి పోవచ్చు....ఆ! దానికి ఫరవాలేదు సార్.



ఇంటర్‌వ్యూయా నా బొందా. మీ కంటేనా.... సార్....ఎస్ సార్....మరి నా ట్రాన్స్‌ఫర్.... చక్రం వెయ్యాలి....సార్....థేంక్యూసార్.... దణ్ణాలు సార్....అమ్మగారికి దణ్ణాలని చెప్పండి సార్....సార్ .....ఉంటాను.....నమస్కారం సార్" అని రిసీవరు పెట్టేసి ముఖంమీద చమట తుడుచుకుంటూ కుర్చీలో కూర్చుని బెల్ నొక్కాడు.

"అమ్మాయిని పిలువు."

సరళ స్ప్రింగ్ డోర్ తోసుకుంటూ వచ్చి నిల్చుంది.

రాజారావు ఫైల్లో తలదూర్చి అటు చూడకుండానే "చూడమ్మాయ్. ప్రస్తుతానికి వేకెన్సీలు లేవు. నీ అప్లికేషన్ తప్పకుండా ఈసారి కన్సిడర్ చేస్తాను. బెటర్ లక్ నెక్ట్స్ టైమ్" అన్నాడు.

సంతకం పెట్టిన ఫైల్ని ట్రేలో విసురుతూ.

ఇది విన్న సరళకి అమాంతంగా నెత్తిమీద పిడుగుపడ్డట్టయింది. తన కళ్ళని తనే నమ్మలేక పోయింది. నిన్నరాత్రి రాజారావు కబంధ హస్తాల్లో నలిగిపోయిన తన శరీరాన్ని పిచ్చిగా చూసుకుంది. కాలిక్రింద నేల కృంగిపోతున్నట్లనిపించింది. రాజారావు వైపు పిచ్చెత్తినట్లు చూసింది. పళ్ళు బిగించింది. కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. కోడె త్రాచులా, కలకత్తా కాళిలా, అడవి పిల్లిలా రాజారావు మీదికి విరుచుకు పడింది.

"యూ రోగ్....స్కౌండ్రల్....ఛీట్.... నిన్ను...." అంటూ మీదికి ఉరికింది.

ఆ తరువాత గోల, కేకలు, ఫర్నిచర్ ఎగురుతున్న చప్పుడు.

ఆఫీసంతా గుమిగూడి పోయింది.

సరళ దెబ్బ తిన్న సివంగిలా రొప్పుతూ రాజారావు మీదికి ఇంకా ఉరక బోతూంటే అప్పన్న గట్టిగా పట్టుకుని ఆపుచేస్తున్నాడు.

రాజారావు తలమీద పేపర్ వెయిట్‌తో కొట్టిన గాయం లోంచి రక్తం బొటబొట టేబిల్‌మీద అద్దంపై పడి చుట్టు ప్రక్కల తుళ్ళుతోంది.

అందరూ గోలపెడుతున్నారు. "పోలీసు స్టేషనుకి కబురు చెయ్యండి." "దీన్ని జోడు తీసుకు కొట్టెయ్యండి." "ఇది పచ్చి బోకురా, నిన్న దొరగారింటికి వెళ్తుంటే దారిలో రిక్షాలో ఎదురయింది."

"ఆగండి! దయచేసి మీరంతా వెళ్ళిపోండి. నాయందు దయ ఉంచి ఆ అమ్మాయిమీద చెయ్యి చేసుకోకండి—పాపం! వేకెన్సీలు లేవనగానే మతిపోయినట్లయింది. పూర్ క్రీచర్"

"అయితే కొడుతుందా?"

"ప్లీజ్.....ప్లీజ్....మీరూరుకోండి. మీకు దణ్ణం పెడుతున్నాను. మీ సీట్లలోకి వెళ్ళి కూర్చోండి" అని చేతుల్ని నెత్తిమీద కెత్తి చుట్టూ తిరుగుతూ అందరికీ దండం పెట్టాడు.

ఇంకా తిడుతూ మీదికి వెళ్ళబోతున్న సరళని అతికష్టంమీద నడిపించుకుంటూ రిక్షా ఎక్కించి ఇంటికి తీసుకు వెళ్ళిపోయాడు అప్పన్న.

ఆ మర్నాడు సరళ తండ్రి చచ్చిపోయాడని తెలిసింది. "అనవసరంగా దొరగార్ని కొడితే ఆ పాపం ఊరికే పోతుందా. దేముడు లేడూ-రోజులు తిరక్కుండానే దాని బాబు టారుమన్నాడు" అన్నారు ఆఫీసులో అంతా.

కొన్నినెలల తరువాత ఒకరోజు "మిమ్మల్ని అదెవర్తో పేపర్ వెయిట్‌తో కొట్టిందే, అది ఈ మధ్యపడుపువృత్తిలోకి దిగిపోయిందటండీ. అప్పన్న చెప్పాడు.........హుం.........బజారు ముండలు" అంది రాజారావు కాళ్ళుపడుతూ సహధర్మ చారిణి.

"పోనిద్దూ ఎవరి పాపాన్ని వాళ్ళుపోతారు" అన్నాడు వేదాంతిలా రాజారావు.

గాజు తొట్టెలో నాచులోంచి 'రిగ్గీ' తన వైపు దొంగ చూపులు చూస్తున్నట్లు రాజారావు గమనించలేదు.

అప్పన్న మాత్రం అప్పుడప్పుడు అనుకుంటూ ఉంటాడు.—"ఈ రోజుల్లో ఒళ్ళు అమ్ముకున్నా ఉద్యోగాలు దొరకడంలేదు— ఏం రోజుల్రా బాబూ!" అని—